# అహింసా మార్గం



## మహాత్మాగాంధీ (స్వాతంత్ర్య ఉద్యమం)

యావత్ భారతదేశాన్ని ఏకతాటిపై తెచ్చి.. స్వాతంత్ర్య పోరాటాన్ని మలుపు తిప్పారు గాంధీజీ. చంపారన్ సత్యాగ్రహం, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా.. తదితర కార్యక్రమాల ద్వారా జాతి మొత్తాన్నీ స్వరాజ్య సాధన ఉద్యమం వైపు నడిపించారు. ఎక్కడా హింసకు తావివ్వలేదు. అంతిమంగా, గాంధీజీ గురి తప్పలేదు. అహింసా మార్గంలోనే స్వాతంత్ర్యం సాధ్యమైంది. అహింసా పరమో ధర్మః అంటూ మహాత్ముడు ప్రపంచంపై చెరగని ముద్ర వేశారు.

## కేసీఆర్ (ప్రత్యేక రాష్ట్ర సాధన)

తెలంగాణ తొలిదశ ఉద్యమం ఉవ్వెత్తున కెరటమై లేచింది. కెరటంలానే పడిపోయింది. ఆత్మార్పణలు, బలిదానాలు జరిగినా.. ప్రత్యేక రాష్ట్రం మాత్రం సాధ్యం కాలేదు. కేసీఆర్ నేతృత్వంలో మొదలైన మలిదశ పోరు ఆ స్వప్నాన్ని నిజం చేసింది. దీనికి కారణం ఆయన ఎంచుకున్న శాంతి మార్గం. ఆయన ధరించిన అహింసా ఆయుధం. పద్నాలుగేండ్ల పాటు కొనసాగిన ఈ సుదీర్ఘ ఉద్యమాన్ని శాంతియుత మార్గంలో నడిపించారు. సమాజంలోని అన్ని వర్గాలనూ ఒక్కతాటిపైకి తీసుకొచ్చారు. రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని కుయుక్తులు పన్నినా.. కేసీఆర్ అహింసా రేఖను దాటలేదు, స్వరాష్ట్ర నినాదం ఆపలేదు. తెలంగాణ సాధించేదాకా వదల్లేదు.





# చట్టసభతో చుట్టరికం





## కరుణానిధి (ఓటమి ఎరుగని నేత)

తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ దివంగత ఎం కరుణానిధి పదమూడు ఎన్నికల్లో ఏకధాటిగా విజయం సాధించారు. 60 ఏండ్లలో ఒక్కసారి కూడా ఓటమిపాలు కాలేదు. 1954లో జరిగిన ఎన్నికల్లో కులితలై నియోజకవర్గంలో గెలిచిన కరుణానిధి.. ఆ విజయాల పర్వాన్ని 2016 వరకూ కొనసాగించారు. ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా తమిళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారు. కొంతమేర జాతీయ రాజకీయాలనూ ప్రభావితం చేశారు.

## కేసీఆర్ (ఆల్ టైమ్ రికార్డ్)

తెలుగు రాష్ట్రాల ఎన్నికల్లో ఎక్కువసార్లు గెలిచిన రికార్డు కేసీఆర్ పేరిటే నమోదైంది. పార్లమెంటు ఎన్నికలను మినహాయిస్తే.. అసెంబ్లీ ఎన్నికల్లోనే కేసీఆర్ 9 సార్లు గెలిచారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత తొలిసారిగా 1983 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి కేసీఆర్ బరిలోకి దిగారు. కానీ, విజయం వరించలేదు. అయితే, 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో విజయం సాధించారు. అప్పటినుంచి వెనుదిరిగి చూడలేదు. 1985, 1989, 1994, 1999, 2001, 2004 ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలిచారు. 2014, 2018, 2023 ఎన్నికల్లో గజ్వేల్ నుంచి గెలుపొందారు. 2004, 2009 ఎన్నికల్లో కరీంనగర్, మహబూబ్‌నగర్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, రాష్ట్రమంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా పనిచేశారు.